بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 06 February 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవ ప్రార్థనల గురించి ఆసక్తికర మరియు విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.02.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. అల్లాహ్ తఆలా మనకు ఆజ్ఞాపించినట్లుగా, నిశ్చయంగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి విషయంలోనూ మనకు ఒక ఉత్తమమైన ఆదర్శం. గత ఖుత్బాలలో ఈ క్రమంలోనే ఆయనకు అల్లాహ్ పట్ల ఉన్న ప్రేమ గురించి ప్రస్తావించడం జరిగింది. దైవ ప్రేమ లేకుండా ఆరాధన సాధ్యం కాదు. ఉలాగే ఆరాధన లేకుండా దైవ ప్రేమ కలగదు. అల్లాహ్ తఆలా పట్ల ప్రేమ లేక పోతే, యథార్థమైన ఆరాధన అసాధ్యం. ఈ రోజు ఈ అంశంపై మరిన్ని వివరాలు తెలియజేస్తాను.

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ స్థాయిని ఈ విధంగా వివరించాడు: قُلۡ اِنَّ صَلَاتِیۡ وَنُسُکِیۡ وَمَحۡیَایَ وَمَمَاتِیۡ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ (అల్అన్ఆమ్:163) అనగా "నా ప్రార్థనలు (నమాజ్), బలిదానము, త్యాగము, నా జీవితము, నా మరణము సర్వలోక ప్రభువైన అల్లాహ్ కొరకే" నని నీవు పలుకుము. ఈ ప్రకటన చేయమని పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి ఆజ్ఞాపించడం ద్వారా, అల్లాహ్ తఆలా మనల్ని కూడా అటువంటి ఉన్నత ప్రమాణాలను సాధించమని ప్రోత్సహిస్తున్నాడు.

హుజూరె అన్వర్ ఇంకా ఇలా ఉపదేశించారు: ఆరాధనల విషయంలో అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మనకు అనేక ఆజ్ఞలను జారీ చేశాడు. అల్లాహ్ తఆలా ఇలా ఆదేశించాడు: وَمَا خَلَقۡتُ الۡجِنَّ وَالۡاِنۡسَ اِلَّا لِیَعۡبُدُوۡنِ (అజ్జారియాత్:57) అనగా నేను, జిన్నాతులను, మానవులను కేవలము నన్ను ఆరాధించుట కొరకే పుట్టించితిని.

ఇలాగే మరొక చోట అల్లాహ్ తఆలా ఈ విధంగా ఆదేశించాడు:

یٰۤاَیُّهَا النَّاسُ اعۡبُدُوۡا رَبَّکُمُ الَّذِیۡ خَلَقَکُمۡ وَالَّذِیۡنَ مِنۡ قَبۡلِکُمۡ لَعَلَّکُمۡ تَتَّقُوۡنَ

(అల్ బఖరహ్:22) ఓ జనులారా! మీ ప్రభువును ఆరాధింపుడు. సంరక్షణమును పొందుడు. మిమ్ములను మీ కంటే ముందున్న వారిని పుట్టించినవాడు అతడు. కావున అల్లాహ్ సామీప్యాన్ని పొందేందుకు మరియు దైవభీతిని పెంపొందించుకోవడానికి అల్లాహ్ తఆలాను ఆరాధించడం, ఆ ఆరాధనల ప్రమాణాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ఎంతో అవసరం.

హుజూరె అన్వర్ ఇట్లు ప్రవచించారు: పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆజ్ఞలను మనకు అందించడమే కాకుండా, స్వయంగా వాటిని ఆచరించి ఆచరణలో అత్యున్నత శిఖరాలను

చేరుకొని చూపారు. మనం కూడా ఆ ప్రమాణాలను చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడే యథార్థమైన విధేయత మరియు అనుసరణ పూర్తవుతుందని ఆయన మనల్ని హెచ్చరించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ఉమ్మత్ (అనుచరుల) కోసం చేసిన దుఆలు (ప్రార్థనలు) మనకు ప్రాప్తించాలన్నా, అవి మనకు ప్రయోజనకరంగా ఉండాలన్నా మనం ఆయన ఆదర్శాలను మరియు ఆజ్ఞలను నిరంతరం దృష్టిలో ఉంచుకుని ఆచరణాత్మకంగా కృషి చేయవలెను.

హుజూరె అన్వర్ ఇంకా ఇట్లు ప్రవచించారు: దీనికి సంబంధించిన కొన్ని ఉదాహరణలు సమర్పిస్తాను. ఒక హదీస్‌లో ఇలా ఉంది: హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారు ఉల్లేఖించిన దాని ప్రకారం, ఒకసారి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం డిజైన్లు (అలంకరణలు) ఉన్న ఒక దుప్పటిపై నమాజు చదివారు. ఆయన దృష్టి ఒక్కక్షణం ఆ డిజైన్ల మీద పడింది. నమాజు పూర్తయ్యాక ఆయన ఇలా అన్నారు: "నా ఈ దుప్పటిని అబూ జహ్మ్ వద్దకు తీసుకువెళ్లి, అతని వద్ద ఉన్న సాదా దుప్పటిని (అన్బిజానియా – ఎటువంటి డిజైన్లు లేనిది) తీసుకురండి. ఎందుకంటే, ఈ డిజైన్లు ఇప్పుడే నా నమాజులో నా ఏకాగ్రతను మళ్లించాయి."

హజ్రత్ జాఫర్ బిన్ ముహమ్మద్ తన తండ్రి ద్వారా ఉల్లేఖించిన మరో కథనంలో ఇలా ఉంది: మేము హజ్రత్ ఆయిషా (రజి) గారిని ఇట్లు అడిగాము "మీ ఇంట్లో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పడక ఎలా ఉండేది? దానికి ఆమె అది తోలుతో చేసినది, దాని లోపల ఖర్జూరపు నార నింపబడి ఉండేదని చెప్పారు. అలాగే హజ్రత్ హఫ్సా (రజి) గారిని కూడా అడగ్గా, ఆమె ఇలా అన్నారు: ప్రవక్త గారి పడక ఉన్నితో చేసినది, మేము దానిని రెండు మడతలుగా వేసేవాళ్లము. దానిపైనే హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం నిద్రించేవారు. ఒక రాత్రి ఈ పడకను నాలుగు మడతలుగా వేస్తే మరింత మెత్తగా ఉంటుంది కదా అని నేను భావించాను. దాని ప్రకారం నేను దానిని నాలుగు మడతలు వేశాను. ఉదయం కాగానే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 'రాత్రి మీరు నా కోసం ఏమి పరిచారు? అని అడిగారు. నేను అది మీ పాత పడకే కాకపోతే మీకు మరింత హాయిగా ఉంటుందని నాలుగు మడతలు వేశానని మనవి చేశాను. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: దీనిని తిరిగి పాత పద్ధతిలోనే (రెండు మడతలుగా) మార్చేయండి. ఎందుకంటే, దాని అతి మెత్తదనం రాత్రి వేళ నా నమాజుకు (తహజ్జుద్‌కు) అడ్డంకిగా మారుతుండెను.

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) గారు ఇలా ఉల్లేఖించారు: నేను ఒక ప్రయాణంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక వాహనంపై కూర్చుని ఉన్నాను. అప్పుడు ఆయన ఓ ముఆజ్ బిన్ జబల్! అని పిలిచారు. దానికి నేను నేను హాజరయ్యాను ఓ దైవప్రవక్త ఇది నా అదృష్టం. అని మనవి చేశాను. అప్పుడు ఆయన బానిసల (మనుషుల) పై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటో నీకు తెలుసా? అని అడిగారు. నేను అల్లాహ్ మరియు అతని ప్రవక్తకే బాగా తెలుసని అన్నాను. అప్పుడు మహా ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: బానిసలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే వారు అతన్ని మాత్రమే ఆరాధించాలి మరియు దేనినీ అతనికి సాటి కల్పించకూడదు. ఆ తర్వాత ఆయన మరికొంత దూరం ప్రయాణించి, మళ్ళీ ఓ ముఆజ్ బిన్ జబల్! అని పిలిచారు. నేను మళ్ళీ లైబైక్ యా రసూలుల్లాహ్, ఇది నా సౌభాగ్యం అని బదులిచ్చాను. అప్పుడు ఆయన మరి బానిసలకు అల్లాహ్‌పై ఉన్న హక్కు ఏమిటో నీకు తెలుసా? అని అడిగారు. నేను అల్లాహ్ మరియు అతని ప్రవక్తకే మెరుగ్గా తెలుసని మనవి చేశాను. దానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: బానిసలను అతను శిక్షించకుండా ఉండటమే (వారు అల్లాహ్‌కు సాటి కల్పించకుండా ఆరాధించినప్పుడు).

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశంసలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఈ విధంగా ప్రవచించారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఖుర్ఆన్ వ్యాప్తికి ఏ విధంగా నియమించబడ్డారో అదే విధంగా సున్నత్ (పద్ధతి)ను స్థాపించడానికి కూడా నియమించబడ్డారు. కనుక పవిత్ర ఖుర్ఆన్ ఏ విధంగానైతే ధృవీకరించబడినదో అదే విధంగా నిరంతరంగా ఆచరించబడుతూ వస్తున్న సున్నత్ కూడా అంతే ఖచ్చితమైనది. ఈ రెండు బాధ్యతలను పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా నెరవేర్చారు. ఆ రెండింటిని తన విధిగా భావించారు. ఉదా॥ నమాజ్ చదవమని ఆజ్ఞ వచ్చినప్పుడు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ఆ వాక్యాన్ని తన ఆచరణ ద్వారా వివరించి చూపారు. ఫజర్ నమాజ్‌కు ఇన్ని రకాతులు, మగ్రిబ్ నమాజ్‌కు ఇన్ని రకాతులు మరియు మిగిలిన నమాజ్‌లకు ఇన్ని రకాతులు ఉంటాయని ఆచరణాత్మక రూపంలో స్పష్టం చేశారు. అదే విధంగా ఆయన హజ్ చేసి చూపించారు మరియు తన చేతుల మీదుగా వేలాది మంది అనుచరులను ఆ ఆచరణకు కట్టుబడి ఉండేలా చేసి, ఒక బలమైన ఆచరణాత్మక వ్యవస్థను స్థాపించారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు తహజ్జుద్ నమాజ్ గురించి ఈ విధంగా వివరిస్తున్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి ఈ నఫిల్ (ఐచ్ఛిక) నమాజుల పట్ల ఎంతటి శ్రద్ధ ఉండేదంటే అవి కేవలం నఫిల్ అయినప్పటికీ తన అనుచరులలో ఎవరెవరు ఈ నమాజ్‌లు చదువుతున్నారో తెలుసుకోవాలని ఆకాంక్షించేవారు. ఆ ఉద్దేశంతోనే ఆయన నగరం సందుల్లో, వీధుల్లో తిరుగుతూ ప్రజలలో ఎవరెవరు తహజ్జుద్ నమాజ్ చదువుతున్నారో ఎవరెవరు చదవట్లేదో స్వయంగా పర్యవేక్షించేవారు. దీనిపై హుజూరె అన్వర్ వ్యాఖ్యానిస్తూ ఇలా సెలవిచ్చారు: ఈ రోజుల్లో ఎవరినైనా మీరు ఎన్ని నమాజ్‌లు చదువుతున్నారు? అని అడిగితే ఇది మా వ్యక్తిగత విషయం అని ప్రజలు కోప్పడుతుంటారు. కానీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రం స్వయంగా తహజ్జుద్ నమాజ్‌ను కూడా పర్యవేక్షించేవారు.

ఒకసారి ఒక సభలో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) గారి ప్రస్తావన వచ్చినప్పుడు, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: అతను చాలా మంచి వ్యక్తి, అయితే అతను తహజ్జుద్ నమాజ్ కూడా చదివితే ఇంకా బాగుంటుంది. ఆ తర్వాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: ఈ లోకంలో అల్లాహ్ అటువంటి భార్యాభర్తలపై తన కరుణను కురిపిస్తాడు: అనగా రాత్రి వేళ భర్తకు మెలుకువ వచ్చినప్పుడు అతను లేచి తహజ్జుద్ చదివి, తన భార్యను కూడా తహజ్జుద్ కోసం నిద్రలేపుతాడు. ఒకవేళ ఆమె నిద్రలేవకపోతే ఆమె ముఖంపై నీళ్లు చిలకరించి మరీ మేల్కొల్పుతాడు. ఇదేవిధంగా ఒకవేళ భార్యకు ముందుగా మెలుకువ వస్తే ఆమె స్వయంగా తహజ్జుద్ చదివి తన భర్తను నిద్రలేపుతుంది. ఆయన నిద్రలేవకపోతే, ఆయన ముఖంపై నీళ్లు చిలకరించి మరీ మేల్కొల్పుతుంది.

హుజూరె అన్వర్ ఇంకా ఇలా ఉపదేశించారు. నమాజ్‌లలో హృదయం ద్రవించడం చాలా అవసరం. దీని కోసం మనిషి నిరంతరం ప్రయత్నించాలి. దీనికి సంబంధించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒక మార్గాన్ని సూచించారు: నమాజ్‌లో నీ ముఖ కవళికలను ఏడుస్తున్నట్లుగా ఉంచుకో ఆ బాహ్య స్థితి ప్రభావం గుండెపై పడుతుంది తద్వారా మనిషికి నిజంగానే కన్నీళ్లు వస్తాయి.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిద్రపోయే ముందు ఆయతుల్ కుర్సీ, అల్-ఇఖ్లాస్, అల్-ఫలక్ మరియు అన్నాస్ (పవిత్ర ఖుర్ఆన్ లోని చివరి మూడు అధ్యాయాలు) మూడుసార్లు చదివి తన చేతులపై ఊదుకునేవారు. ఆ తర్వాత తన చేతులను శరీరంపై ఎక్కడి వరకు వీలైతే అక్కడి వరకు రాసుకునేవారు. ఈ ప్రక్రియను ఆయన తన తల నుండి ప్రారంభించేవారు.

హుజూరె అన్వర్ ఇంకా ఇలా ఉపదేశించారు. కొంతమంది తమ ఉత్తరాలలో ఇలా అడుగుతుంటారు: మాలో పుణ్యగుణాలు పెంపొందేలా, మా పాపాలు తుడిచిపెట్టుకుపోయేలా, మా పనులు నెరవేరేలా మరియు అల్లాహ్ తఆలా సామీప్యం లభించేలా ఏదైనా చిన్న దుఆ (ప్రార్థన) లేదా ఏదైనా 'జికర్' (దైవస్మరణ) తెలపండి. అయితే, దీనికి సంబంధించి మొట్టమొదటి విషయం ఆరాధన, అంటే అల్లాహ్ విధించిన ఫర్జ్ (అనివార్య) నమాజులు. ఆ తర్వాతే దైవస్మరణ (జికర్–ఎ–ఇలాహి) వస్తుంది. దైవస్మరణ మనిషిని మరిన్ని పుణ్యకార్యాల వైపు మళ్ళిస్తుంది. వీటితో పాటు ఇతర సద్గుణాలను అలవరుచుకోవడం మరియు సత్కార్యాలు చేయడం కూడా అంతే అవసరం.

ఒక కథనంలో ఇలా ఉంది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొన్నిసార్లు పాదరక్షలతో కూడా నమాజు చదివేవారు. అంటే ఎక్కడైతే సులభతరమైన మార్గం అవసరమో దానిని ఆయన అవలంభించేవారు. కాబట్టి, పాదరక్షలు శుభ్రంగా ఉండి, అపవిత్రత అంటుకునే ప్రమాదం ఉన్న చోట్ల చెప్పులు ధరించి కూడా నమాజు చదవవచ్చు. ఈ విధంగా చేయడం ద్వారా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముస్లిం ఉమ్మత్‌పై ఒక గొప్ప ఉపకారం చేశారు. అనవసరమైన ఆడంబరాలు మరియు కష్టాల నుండి వారిని కాపాడారు.

జమాఅత్ (సామూహిక) నమాజు పట్ల దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతటి శ్రద్ధ వహించేవారంటే, ఒకసారి ఒక అంధుడు ఆయన వద్దకు వచ్చి ఇలా మనవి చేసుకున్నాడు: ఓ దైవప్రవక్త! నా ఇల్లు మసీదుకు చాలా దూరంలో ఉంది. మసీదుకు రావడంలో నేను చాలా ఇబ్బందులు పడుతున్నాను. కాబట్టి, వర్షం కురిసే రోజుల్లో ఇంట్లోనే నమాజు చదువుకోవడానికి నాకు అనుమతించండి. మొదట పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సరే చదువుకో అని చెప్పారు. అతను వెళ్ళిపోతుండగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులతో అతనిని తిరిగి పిలవండని చెప్పారు. అతను తిరిగి రాగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అడిగారు: నీ ఇంటి వరకు అజాన్ వినిపిస్తుందా? దానికి అతను అవును యా రసూలుల్లాహ్! అజాన్ వినిపిస్తుందని బదులిచ్చాడు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: అజాన్ శబ్దం నీకు వినిపిస్తున్నట్లయితే, కచ్చితంగా మసీదుకే రావలెను.

ఆరాధనల హక్కును నెర నెరవేర్చుటకు అల్లాహ్ తాలా మనందరిని అనుగ్రహించుగాక! పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ ఆదర్శాన్ని అనుసరించే భాగ్యాన్ని మనకు కల్పించుగాక!ఆమీన్.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ أَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -